
సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 17 । మార్చి । 2024



రోగులకు తొలి వైద్యుడు ఫార్మసిస్టే

అనారోగ్యంగా ఉన్న ప్రతి రోగికి తొలి వైద్యుడు ఫార్మసిస్టే. ఏ మాత్రం నలతగా ఉన్నా రోగి ముందు సంప్రదించేది వారినేనని పలువురు నిపుణులు పేర్కొన్నారు. - 8లో▸



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సెహరీ సోమ (ఉ॥)
రాజమహేంద్రవరం	6.22	4.48
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

గెలుపు గుర్రాలతో సిద్ధం

- సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ అభ్యర్థులు రెడీ
- సామాజిక సమీకరణలు, సర్వేలే ప్రామాణికంగా ఎంపిక
- 2 ఎస్సీ, 3 బీసీ, 3 ఓసీలకు కేటాయింపు
- ఎంపీ అభ్యర్థిగా ప్రముఖ వైద్యుడు గూడూరి శ్రీనివాస్‌కు అవకాశం
- అభ్యర్థుల ప్రకటనతో క్యాడర్‌లో జోష్
- విజయమే లక్ష్యంగా ముమ్మర ప్రచారం

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్ సీపీ గెలుపు గుర్రాలు సంసిద్ధమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ తన అభ్యర్థులను ప్రకటించింది. సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటూ, సర్వేలను ప్రామాణికంగా తీసుకుంటూ అభ్యర్థులను ఎంపిక చేశారు. జిల్లాలో ఒక లోక్‌సభ, 7 అసెంబ్లీ స్థానాలు ఉండగా, ఈ ఎనిమిదింటిలో మూడు బీసీలకు, మూడు ఓసీలకు, రెండు ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించారు. ఇప్పటికే మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా ఉన్న తానేటి వనిత, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజా, తలారి వెంకట్రావు, జి.శ్రీనివాస్‌నాయుడులకు తిరిగి టికెట్లు ఖరారు చేశారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దింపారు. ఎంపీగా ప్రముఖ వైద్యుడు గూడూరి శ్రీనివాస్ పోటీ చేస్తున్నారు. ఎటువంటి గందరగోళం, జాప్యం లేకుండా అభ్యర్థులను ప్రకటించడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ఎన్నికల జోష్ నెలకొంది. వాస్తవానికి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఎమ్మెల్యేలు, పార్టీ కో ఆర్డినేటర్లు నిరంతరం ప్రజల్లో ఉండేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గ పరిధిలోని అన్ని ఇళ్లనూ సందర్శించే బృహత్తర కార్యక్రమం చేపట్టారు. తద్వారా ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని, పరిష్కరించే అవకాశం కల్పించారు. వీటితో పాటు సీఎం జగన్ నేతృత్వంలో చేపట్టిన వివిధ కార్యక్రమాలతో నిత్యం ప్రజల్లో ఉండటంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

రాజమహేంద్రవరం రూరల్

చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ (బీసీ–శెట్టిబలిజ)



రాజమహేంద్రవరం రూరల్ స్థానం నుంచి రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ బరిలోకి దిగుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా, జెడ్పీ చైర్మన్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) సభ్యునిగా పని చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం వైఎస్సార్ సీపీలో చేరి, 2014లో కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019 ఎన్నికల్లో రామచంద్రపురం నుంచి గెలుపొందిన ఆయనను సీట్ల సర్దుబాటులో భాగంగా ఇటీవల రూరల్‌కు కేటాయించారు. 2020లో బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2022 ఏప్రిల్ 11న జరిగిన మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అనంతరం బీసీ సంక్షేమంతో పాటు సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా వ్యవహరిస్తున్నారు. వేణుకు రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కొత్త అయినప్పటికీ కొద్ది నెలల్లోనే సుపరిచితునిగా ముద్ర వేసుకున్నారు. 'స్వచ్ఛత – బాధ్యత' పేరుతో నియోజవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. అన్ని సామాజికవర్గాల ప్రజలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు మద్దతు కూడగడుతున్నారు.

గోపాలపురం

తానేటి వనిత (ఎస్సీ – మాదిగ)



రాజకీయ నేపథ్యం కలిగిన రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈ ఎన్నికల్లో గోపాలపురం నుంచి ఎమ్మెల్యేగా బరిలో నిలుస్తున్నారు. 2019 ఎన్నికల్లో కొవ్వూరు నుంచి గెలిచిన ఆమెకు సీట్ల సర్దుబాటులో భాగంగా సొంత నియోజకవర్గమైన గోపాలపురం వెళ్లడం కలిసొచ్చే అంశం. ఇంతకు ముందే పరిచయం ఉన్న నియోజకవర్గం కావడంతో మార్పు చేసిన వెంటనే రంగంలోకి దిగారు. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అన్ని వర్గాలనూ కలుపుకుని ముందుకు సాగుతున్నారు. ప్రతి రోజూ ఐదారు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పార్టీ శ్రేణులతో పరిచయ కార్యక్రమాలు చేపడుతున్నారు.

రాజానగరం

జక్కంపూడి రాజా ఇంద్రవందిత్ (ఓసీ – కాపు)




రాజానగరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఇంద్రవందిత్ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా మరోసారి బరిలోకి దిగనున్నారు. దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు తనయుడిగా తండ్రి స్ఫూర్తితో రాజకీయాల్లో వచ్చిన ఆయన వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షునిగా పని చేశారు. 2019లో రాజానగరం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షునిగా ఉన్నారు. నియోజవకర్గ అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. గడప గుడపకూ మన ప్రభుత్వం పేరిట నియోజకవర్గం మొత్తం పర్యటించి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేశారు. గ్రామ/వార్డు సచివాలయాల నిర్మాణంలో నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపారు. కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు విశేష కృషి చేశారు. రైతు సమస్యల పరిష్కారం, నీటి విడుదల, ఇరిగేషన్ పథకాలకు నిధుల విడుదలలో సఫలీకృతులయ్యారు.



రాజమహేంద్రవరం సిటీ

మార్గాని భరత్‌రామ్ (బీసీ – గౌడ)



ప్రస్తుతం రాజమహేంద్రవరం ఎంపీగా ఉన్న మార్గాని భరత్‌రామ్ సీట్ల సర్దుబాటులో భాగంగా ఈసారి సిటీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. సినీ రంగం నుంచి 2019లో రాజకీయ రంగప్రవేశం చేసి, ఆ ఎన్నికల్లో రాజమహేంద్రవరం ఎంపీగా గెలిచారు. 'గుడ్ మార్నింగ్ రాజమండ్రి', రచ్చబండ వంటి కార్యక్రమాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో రూ.270 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. మోరంపూడి ఫ్లై ఓవర్ నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఈఎస్ఐ ఆస్పత్రి ఆధునీకరణకు పాటుపడ్డారు. నగరంలో ఆహ్లాదం పంచేందుకు మొక్కల పెంపకం, కంబాలచెరువు పార్కు అభివృద్ధి, గ్లో గార్డెన్ వంటి అభివృద్ధి పనులు చేపట్టారు. నగరంలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

నిడదవోలు

జి.శ్రీనివాసనాయుడు (ఓసీ – కాపు)



1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న జి.శ్రీనివాసనాయుడు నిడదవోలు నుంచి మరోసారి ఎమ్మెల్యేగా పోటీకి దిగుతున్నారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్వహించిన పాదయాత్రలో కీలక భూమిక పోషించారు. 2009లో నిడదవోలు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2019లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా విజయ దుందుభి మోగించారు. గడచిన ఐదేళ్లుగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంలో కీలక పాత్ర పోషించారు. వివిధ సంక్షేమ పథకాల కింద నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా రూ.1,450 కోట్ల మేర లబ్ధి చేకూర్చారు. నియోజకవర్గంలో రూ.670 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. ఒక్క నిడదవోలు పట్టణంలోనే రూ.376 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద 90 వేల ఇళ్లను సందర్శించారు.

కొవ్వూరు

తలారి వెంకట్రావు (ఎస్సీ – మాల)



సీనియర్ నేత తలారి వెంకట్రావు ఈసారి కొవ్వూరు నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 25 ఏళ్ల పాటు కాంగ్రెస్‌లో పని చేసిన ఆయన 2010లో వైఎస్సార్ సీపీలో చేరారు. 2010–14 మధ్య పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పని చేశారు. 2014లో పోటీ చేసి ఓడిపోయారు. 2019లో గెలిచారు. ప్రస్తుతం సీట్ల మార్పులో భాగంగా కొవ్వూరు నుంచి బరిలోకి దిగుతున్నారు. నియోజకవర్గం మారినప్పటి నుంచీ ప్రజల్లోనే ఉంటున్నారు. 'ఆశీర్వదించండి' అంటూ ప్రతి గడపా తడుతున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేస్తున్నారు. తన పదవీ కాలంలో గోపాలపురం నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్, ఆర్టీఓ కార్యాలయం, పోలీస్ సర్కిల్, హౌసింగ్ డీఈ కార్యాలయాలు తీసుకురావడంలో కీలక భూమిక పోషించారు. ఎస్ఈబీ సర్కిల్ కార్యాలయం కూడా నియోజకవర్గానికి తీసుకుని వచ్చారు.

అనపర్తి


డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి (ఓసీ – రెడ్డి)



అనపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇక్కడి నుంచే మరోసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. వృత్తిరీత్యా వైద్యుడు అయిన ఆయన 2010లో వైఎస్సార్ సీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడారు. 2019లో భారీ మెజారిటీతో గెలిచారు. ప్రముఖ వైద్యుడు, సౌమ్యుడిగా పేరొందిన ఆయన అనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 100 పడకల ఆస్పత్రిగా తీర్చిదిద్దారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా 58 గ్రామాల్లో ప్రతి గడపనూ తట్టారు. ఏదైనా సమస్యపై సామాన్య ప్రజలు అర్ధరాత్రి ఫోన్ చేసినా స్పందించి, పార్టీలకు అతీతంగా సాయం చేస్తారన్న ఖ్యాతి గడించారు.

రాజమహేంద్రవరం లోక్‌సభ

డాక్టర్ గూడూరి శ్రీనివాస్ (బీసీ – శెట్టిబలిజ)



నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు (పల్మనాలజిస్ట్) డాక్టర్ గూడూరి శ్రీనివాస్ రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఎటువంటి సిఫారసూ లేకుండానే వ్యక్తిత్వాన్ని, చేసిన సేవలనే ప్రామాణికంగా తీసుకుని ఆయనను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. పార్లమెంటరీ కో ఆర్డినేటర్‌గా ఎంపిక చేసిన నాటి నుంచి జిల్లావ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. సౌమ్యుడిగా పేరొందిన డాక్టర్ గూడూరిని ప్రజలు అక్కున చేర్చుకుంటున్నారు.

ప్రజల నాడి పట్టిన డాక్టర్

పేరు: గూడూరి శ్రీనివాస్
ప్రస్తుత హోదా: వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ కో ఆర్డినేటర్
విద్యార్హతలు: ఎంబీబీఎస్, డీఎల్ఓ (ఈఎన్‌టీ), ఎండీ (పల్మనరీ మెడిసిన్)
తండ్రి: గూడూరి రామ్‌దాస్
తల్లి: విజయభారతి
భార్య: గూడూరి రాధిక (న్యాయవాది), కాంగ్రెస్ కార్పొరేటర్‌గా పని చేశారు. ఒక కుమారుడు.
రాజకీయ నేపథ్యం: రాజమహేంద్రవరంలో ప్రముఖ వైద్యుడు అయిన ఆయన గత ఏడాది వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం సిటీ కో ఆర్డినేటర్‌గా పని చేశారు. నగరంలో విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.
ఇతర వివరాలు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాజమండ్రి సెక్రటరీగా, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (ఏపీఎన్ఏ) ప్రెసిడెంట్, సెక్రటరీగా వ్యవహరించారు.

కోనసీమలో సీఎం జగన్ ఎన్నికల శంఖారావం

19 రావులపాలెంలో బహిరంగ సభ



సాక్షి, అమలాపురం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారిగా కోనసీమ గడ్డపై నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ప్రతిపక్షాల కన్నా ముందే లోక్‌సభ, అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించి ఒక అడుగు ముందే ఉన్న వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారాన్ని సైతం ముందుగానే ప్రారంభించనుంది. ఈ నెల 19వ తేదీన కొత్తపేట నియోజకవర్గం రావులపాలెంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటున్నారు. స్థానిక ఆకుల వీర్రాజు విగ్రహం వద్ద మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్ ఆవరణలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఈ సభ జరుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి శనివారం రాత్రి తెలిపారు. సీఎం జగన్ కోనసీమ గడ్డపై నిర్వహిస్తున్న తొలి ఎన్నికల సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు, నాయకులకు, అభిమానులకు జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు.

ఎన్నికలకు పక్కాగా ఏర్పాట్లు

- తక్షణమే కోడ్ అమలు
- కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎస్పీ జగదీష్, జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లాలో పక్కాగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులోకి వచ్చిందని చెప్పారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌తో కలసి ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం ఆమె దిశా నిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా రూ.50 వేలు మించి నగదు తీసుకుని వెళ్లడానికి అనుమతి లేదని, ఎటువంటి ఆధారాలూ లేకుండా ఎక్కువ మొత్తాలు తీసుకుని వెళ్తే సీజ్ చేయాలని ఆదేశించారు. మంత్రులు, ఇతర రాజకీయ నాయకుల సమీక్షలు, సమావేశాల్లో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొనరాదని తెలిపారు. ఎన్నికల అధికారిక విధుల్లో భాగంగా మాత్రమే రాజకీయ పార్టీల ప్రతినిధులు వచ్చి కార్యాలయాల్లో అధికారులను కలవవచ్చని చెప్పారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల విషయంలో మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు. సైరన్ కలిగిన పైలట్ కారును మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల పర్యటనల్లో ఉపయోగించరాదని తెలిపారు. 24 గంటల్లోగా ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ ప్రచారానికి సంబంధించిన వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. రానున్న 48 గంటల్లోగా పబ్లిక్ ఆస్తులు, కార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రైల్వే, రోడ్డు వంతెనలు, రోడ్ల పక్కన, ప్రభుత్వ బస్సులు, విద్యుత్ స్తంభాలు, మున్సిపల్, పంచాయతీల్లో ప్రభుత్వ ప్రకటనలు, హోర్డింగులు తొలగించాలని స్పష్టం చేశారు. నిర్ణీత రుసుం చెల్లించిన వాటిని కొనసాగించవచ్చని తెలిపారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో ప్రభుత్వ ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రభుత్వ ప్రకటనలన్నింటినీ రానున్న 48 గంటల్లోగా నిలుపు చేయాలని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు.

క్లుప్తంగా

లోక్ అదాలత్‌లో 1,513 కేసుల పరిష్కారం



బాధితులకు రూ.1.12 కోట్ల నష్టపరిహారం నమూనా చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి జిల్లా పరిధిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఆధ్వర్యంలో 64 బెంచ్‌లు ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో కేసులను పరిష్కరించారు. రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, అలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఒక కేసులో రూ.1.12 కోట్ల నష్టపరిహారాన్ని బాధితులకు అందించారు. ఒక రోడ్డు ప్రమాదం కేసులో 2021లో యార్లగడ్డ బృందాదేవి కేసు వేశారు. అది రాజీమార్గం ద్వారా పరిష్కారం కావడంతో నష్టపరిహారం సొమ్మును జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయమూర్తి గంధం సునీత బాధితులకు అందించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,513 కేసులను పరిష్కరించి, బాధితులకు రూ.రూ.2.30 కోట్ల నష్టపరిహారం అందజేశారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. అర్చకులు స్వామివారిని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలోని క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.38,57,853 ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధి వెంకటాపురం సమీపంలో ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గోకవరంలోని సంజీవయ్య నగర్‌కు చెందిన మర్ల భూషణం (58) ఓ ప్రైవేటు పాఠశాలలో వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉదయం వ్యాన్‌ను తీసుకురావడానికి ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరి వెళుతుండగా వెంకటాపురం శివారున రంపచోడవరం వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయమైన భూషణం అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగులకు తొలి వైద్యుడు ఫార్మసిస్టే

- ఓపికగా వైద్యసేవలు అందించాలి
- సీఈపీలో నిపుణుల సూచన



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: అనారోగ్యంగా ఉన్న ప్రతి రోగికి తొలి వైద్యుడు ఫార్మసిస్టే, ఆరోగ్యం ఏ మాత్రం నలతగా ఉన్నా రోగి ముందు సంప్రదించేది వారినేనని పలువురు నిపుణులు పేర్కొన్నారు. కాకినాడ లచ్చిరాజు వీధిలోని ఏపీఎన్‌జీవో భవంతిలో శనివారం రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి, ఆంధ్రప్రదేశ్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (సీఈపీ) జరిగింది. ఫార్మసిస్టులకు రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియం కేరీ పర్యవేక్షణలో నలుగురు నిపుణులు శిక్షణనిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్టులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సీఈపీలో భాగంగా ప్రైవేటు ఫార్మసిస్టులకు కూడా శిక్షణనిచ్చినట్టు విలియం తెలిపారు. నిపుణుల బృందంలో జేఎన్‌టీయూ కాకినాడ స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీస్ హెచ్‌వోడీ డాక్టర్ బి.భవాని, కిట్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఫర్ విమెన్, దివిలి, ప్రొఫెసర్ కమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.మధు, గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ రాజమహేంద్రవరం హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.రామమ్, వికాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వి.సతీష్ కుమార్ ఉన్నారు. మొత్తం నాలుగు సెక్షన్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరిగింది.

మోతాదుకు మించితే ముప్పే

యాంటీబయాటిక్స్‌ను మోతాదుకు మించి వాడితే దీర్ఘకాలిక సమస్యలు వస్తాయని నిపుణులు తెలిపారు. డాక్టర్ చీటీ లేకుండా యాంటీబయాటిక్స్ ఇవ్వకూడదన్నారు. ప్రతి ఫార్మసిస్టూ మందుల కేటగిరీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మందులు కొనుగోలు చేసే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలకు బయటకు చెప్పకూడదన్నారు. పీడీ కంపెనీల మందులను గుర్తించినా, వాటి పనితీరులో అనుమానాలున్నా తక్షణమే డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. యాంటీ బయాటిక్స్‌తో పాటు పారాసిట్మాల్ వినియోగంలో నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. వీటిని మోతాదుకు మించి వాడితే మాత్రం ప్రమాదం తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జరిగిన ఈ శిక్షణలో ఏపీ ఫార్మసీ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ పులిపాటి సౌజన్య, కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు వై.పద్మమీనాక్షి, కార్యదర్శి కె.చక్రధారి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సీఈపీ సమన్వయకర్త జి.దుర్గాప్రసాద్, ఏపీఎన్‌జీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహన్‌రావు, కార్యదర్శి వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



ఫార్మసిస్టులను మరింత నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడానికే ఈ కార్యక్రమం నిర్వహించాం. దీనికి విశేష స్పందన లభించింది. వందల మంది ఫార్మసిస్టులు హాజరయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు ఫార్మసిస్టులకు ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హాజరవుతున్న ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్ ఇస్తున్నాం.

– ఎం.విలియం కేరీ,
రిజిస్ట్రార్, ఏపీ ఫార్మసీ కౌన్సిల్

యూట్యూబ్‌లో మందులు వెతకొద్దు



ఇటీవల చాలామంది యూట్యూబ్‌లో వెతికి వివిధ రోగాలకు మందులను వాడుతున్నారు. ఆ తరహా వైద్యం మంచిది కాదు. ఈ తరహా ప్రయత్నాలు కోవిడ్ అనంతరం ఎక్కువయ్యాయి. అలాంటి వారికి ఫార్మసిస్టులు అవగాహన కల్పించాలి. రోగుల ఆరోగ్య భద్రతకు కృషి చేయాలి.

– వై.పద్మమీనాక్షి,
ఏపీఎన్‌జీవో రాష్ట్ర మహిళా విభాగం

కొత్త రూపాలు



ఔషధ పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ కొత్త రకాల మందులు వస్తున్నాయి. ఇవి రోగులకు ఎంతో ప్రయోజనం కలిగిస్తున్నాయి. పాచెస్, సపోస్టరీస్, ఇన్‌హేలర్స్, బక్కెల్స్, క్రీమిక్సెస్ వంటివి ఈ కోవలోకే వస్తాయి. ఇవి ఔషధాల్లో వివిధ రూపాలు. ఇటువంటి ఔషధాల వినియోగంపై చాలా మంది ఫార్మసిస్టుల్లో అవగాహన లేదు. ఈ శిక్షణతో సమస్య పరిష్కారమైంది. – పసుపులేటి శ్రీనివాస్,
ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్
అధ్యక్షుడు, ఉమ్మడి తూర్పుగోదావరి శాఖ

టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి షర్మిల అశోక తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో కండక్టర్లకు తమ హాల్ టిక్కెట్లు చూపించి విద్యార్థులు ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

శ్రీనిధి నిధుల స్వాహాపై విచారణ

అయినవిల్లి: అయినవిల్లి –2 యానిమేటర్ వై.హేమలత శ్రీనిధి నిధులు స్వాహా చేసి గల్ఫ్‌కు పరారైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దీనిపై డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్‌కు అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఇందుకోసం శ్రీనిధి ఏజీఎం ప్రసన్న, మేనేజర్ ఎం.నరసింహరావుతో పాటు మరో ఇద్దరు మేనేజర్లతో విచారణ బృందాన్ని నియమించారు. ఈ మేరకు శనివారం శ్రీనిధి మేనేజర్ నరసింహారావు విచారణ నిర్వహించారు. యానిమేటర్ వై.హేమలత ఆధ్వర్యంలో 31 మహిళా సంఘాలు నడుస్తున్నాయని, వాటిలో 9 సంఘాల సభ్యులు శ్రీనిధి రుణాలు పొందారన్నారు. ఇప్పటి వరకూ జరిగిన విచారణలో సంఘ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం రూ.5.34 లక్షలను హేమలత స్వాహా చేసినట్లు గుర్తించామన్నారు. సోమవారం కూడా విచారణ కొనసాగుతుందని తెలిపారు.

రత్నగిరిపై భక్తులకు అన్ని వసతులు

- మంత్రి కొట్టు సత్యనారాయణ
- సత్యదేవుని ప్రసాదం స్టాల్ ప్రారంభం



అన్నవరంలో ప్రసాదం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ, చిత్రంలో చైర్మన్ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్



తలుపులమ్మవారి ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

అన్నవరం: అన్నవరంలోని శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నట్టు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. జాతీయ రహదారిపై విశాఖపట్నం – రాజమహేంద్రవరం వైపు స్థానిక డిగ్రీ కళాశాల వద్ద దేవస్థానం స్థలంలో రూ.3.57 కోట్లతో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద స్వామి వారి ప్రసాదం స్టాల్‌ను ఆయన శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖపట్నం వైపు ప్రయాణించే భక్తుల కోసం సుమారు 20 ఏళ్లుగా జాతీయ రహదారిపై గల సత్యదేవుని ప్రసాదం స్టాల్‌లో గోధుమ నూక ప్రసాదం విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అయితే విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు ప్రయాణించే భక్తులు స్వామివారి ప్రసాదాలను కొనుగోలు చేయాలంటే రోడ్డు దాటాల్సి వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక డిగ్రీ కళాశాల వద్ద విశాఖపట్నం – విజయవాడ రహదారిని ఆనుకుని సత్యదేవుని నమూనా ఆలయం, ప్రసాదం స్టాల్, భక్తుల కోసం ఫుడ్ కోర్టు, ఏడు షాపులు, టాయిలెట్లు నిర్మిస్తున్నామన్నారు. సుమారు 30 కార్లను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా ఆలయం ముందు పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ పూర్తయ్యేందుకు మూడు నెలలు సమయం పట్టే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందుగా ప్రసాదం స్టాల్‌ను ప్రారంభించామన్నారు.

నమూనా ఆలయ నిర్మాణం పరిశీలన

సత్యదేవుని నమూనా ఆలయ నిర్మాణ పనులను మంత్రి కొట్టు సత్యనారాయణ పరిశీలించారు. ఆలయంలో శిలామూర్తులను ప్రతిష్ఠించాలని, రత్నగిరిపై సత్యదేవుడు, అమ్మవారికి ప్రసాదాలు నివేదిస్తున్నట్లుగానే ఇక్కడ కూడా జరపాలన్నారు. ఆయన వెంట దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు కటకం సత్యనారాయణ, ఈఈ నరసింహారెడ్డి, నమూనా ఆలయ కాంట్రాక్టర్ సుబ్బరాజు, డీఈ గుర్రాజు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు భూమిపూజ

రత్నగిరిపై పాత టీటీడీ సత్రం స్థలంలో కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ నిధులు రూ.12 కోట్లతో నిర్మించనున్న సత్యదేవుని నిత్య అన్నదాన భవనం, రూ.ఐదు కోట్లతో నిర్మించనున్న క్యూ కాంప్లెక్స్ భవనానికి మంత్రి కొట్టు సత్యనారాయణ భూమి పూజ చేశారు.

శరవేగంగా లోవ దేవస్థానం అభివృద్ధి పనులు

తుని రూరల్: భక్తుల మనోభావాలకు అనుగుణంగా లోవ దేవస్థానాన్ని పునర్నిర్మిస్తున్నట్టు దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. రూ.13 కోట్లతో పునర్నిర్మించిన తలుపులమ్మ ఆలయాన్ని శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు. ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం, స్థానిక ఎమ్మెల్యే, రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చొరవతో ఆలయాన్ని కృష్ణశిలతో అత్యాధునికంగా పునర్నిర్మిస్తున్నట్టు తెలిపారు. వృద్ధులు, చిన్నారుల సౌకర్యార్థం ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహా గాలిగోపురం, ఇతరేతర అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. పునర్నిర్మాణంతో ఇప్పటి వరకూ బాలాలయంలో అమ్మవారిని ప్రతిష్ఠించి దర్శనాలు కొనసాగించినట్టు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబు రాజు, సర్పంచ్ లంక వెంకటలక్ష్మి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు, నాయకులు పోతల రమణ, లంక కృపానందం, ధర్మకర్తలు పాల్గొన్నారు.

మాజీ మంత్రి జవహర్ యూటర్న్

- తిరువూరు టిక్కెట్ కోసం ప్రయత్నాలు
- కొవ్వూరులో ఆయన అనుచరుల గగ్గోలు

కొవ్వూరు: మాజీ మంత్రి కేఎస్ జవహర్ యూటర్న్ తీసుకున్నారు. కొవ్వూరు టిక్కెట్ ఇవ్వకపోవడంతో తిరువూరులోనైనా అవకాశం ఇవ్వాలంటూ అధినేతను వేడుకొంటున్నారు. టీడీపీ కొవ్వూరు టిక్కెట్ ముప్పిడి వెంకటేశ్వరరావుకు కేటాయించడంపై ఆయన షాకయ్యారు. తాను నియోజకవర్గం నుంచే పోటీలో ఉంటానని రెండు రోజుల క్రితం శపథం చేశారు. అది నిజమేననుకుని ఆయన వర్గీయులందరూ భ్రమ పడ్డారు. అయితే జవహర్ ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన తిరువూరుపై ఆయన కన్నేశారు. దీనిలో భాగంగా ఆయన స్వగ్రామమైన గానుగపాడు పయనమయ్యారు. అక్కడే మకాం వేసి ఆదివారం నాలుగు మండలాలకు చెందిన టీడీపీ నాయకులతో భేటీ కానున్నట్లు సమాచారం. దీంతో ఐదేళ్లుగా కొవ్వూరులో ఆయన వర్గీయులుగా ముద్ర వేసుకున్న నాయకుల భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. టీడీపీ అధిష్టానం కొవ్వూరు టిక్కెట్‌ను ముప్పిడి వెంకటేశ్వరరావుకు కేటాయించడంపై జవహర్ వర్గం తీవ్రస్థాయిలో మండిపడింది. శుక్రవారం కూడా జవహర్ విలేకరుల సమావేశం నిర్వహించి, తాను కొవ్వూరు నుంచి కచ్చితంగా పోటీలో ఉంటానని వెల్లడించారు. ఇప్పుడు జవహర్ యూటర్న్ తీసుకోవడంతో ఆయన వర్గీయులకు ఏమి చేయాలో తెలియడం లేదు. ముప్పిడికి టిక్కెట్ ఇవ్వడాన్ని విభేదించిన తాము.. మళ్లీ ఆయన చెంతకు ఎలా వెళ్లతామంటూ తెలుగు తమ్ముళ్లు గగ్గోలు పెడుతున్నారు. ఐదేళ్ల నుంచి జవహర్ కోసం ఎన్నోసార్లు తగవులు పడ్డాం, ఇప్పుడు టీడీపీలో వ్యతిరేక వర్గంతో కలిసి ఎలా పనిచేయగలమంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే జవహర్ మాత్రం మరోసారి తిరువూరు నుంచి అవకాశం ఇవ్వాలంటూ అధినేతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

గ్రూప్ – 1 పరీక్షలపై

ఇబ్బందులుంటే తెలపండి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఏపీపీఎస్సీ గ్రూప్–1 పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అభ్యర్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే 89779 35609 ఫోన్ నంబర్‌కు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 వరకూ ఫోన్ చేయవచ్చని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం విజయవాడ నుంచి ఏపీపీఎస్సీ, ఎన్నికలు, పంచాయతీరాజ్, రీసర్వే, వైద్య,ఆరోగ్యం తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జేసీ ఎన్.తేజ్ భరత్, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కేంద్రాలను తనిఖీ చేసే అధికారుల వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఉపాధి పథకం కింద 52 లక్షల పని దినాలకు గానూ సుమారు 48 లక్షలు పని దినాల లక్ష్యం సాధించామన్నారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.